క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

బల్లికురవ: మండల పరిషత్ కార్యాలయం వద్ద 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా 20 సచివాలయాల్లో 297 మందికి ఇంటి స్థల హక్కు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు మండల ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బల్లికురవలో ఉదయం 11 గంటలకు వైఎస్సార్ పార్టీ కార్యాలయ ప్రారంభం, నక్కబొక్కలపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి హాజరవుతారని ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన పి. హూసేన్ (45), కొల్లనకోట నరేష్ (35) ఇద్దరు అనారోగ్య కారణంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బిజ్జం శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ పార్టీలకు అతీతంగా బాధల్లో ఉన్న ప్రతి పేదవాడికి సాయం చేసేందుకు ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, తిరపతయ్య, శ్రీనివాసరావు, మీరావలి తదితరులు ఉన్నారు.

15 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



అద్దంకి రూరల్: కళాశాల విద్యాకమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ కళాశాలలో ఫిబ్రవరి 27న జాబ్‌డ్రైవ్‌లు నిర్వహించారు. దీనిలో భాగంగా అద్దంకిలోని కేఆర్కే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 46 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 15 మందికి వివిధ కంపెనీలో ప్లేస్‌మెంట్లు లభించినట్లు శనివారం ప్రిన్సిపల్ మోహన్‌రావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పాతులూరి దాస్, జేకేసీ కోఆర్డినేటర్ షర్మిలారాణి, ఏ. శిఖామణి, హేమలత, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సరళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 3వ తేదీ నుంచి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు అవసరం



చీరాల: వాహనం నడిపే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించడం వలన ప్రమాదాలకు గురి కాకుండా ఉండవచ్చని ఈపూరుపాలెం ఎస్సై శివ కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిట్టువారిపాలెం జంక్షన్ వద్ద ఎస్సై, సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న 30 మందికి జరిమానా విధించారు.

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు

● నేడు జాతీయ పోలియో చుక్కల దినం

కారంచేడు: జాతీయ పోలియో చుక్కల దినం (పోలియో ఆదివారం) కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కారంచేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే జెస్సీరాణి అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో పల్స్ పోలియో ర్యాలీని నిర్వహించారు. మన దేశం నుంచి పోలియో మహమ్మారిని తరిమికొట్టేలా మీ బిడ్డలకు (0-5 సంవత్సరాలు) ఆదివారం జరిగే పోలియో చుక్కల కేంద్రం వద్దకు తీసుకొచ్చి చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 0-5 సంవత్సరాల పిల్లలను 3144 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ఆదివారం పోలియో చుక్కలు మింగించేందుకు 24 చోట్ల బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇవి కాకుండా రెండు మొబైల్ వాహనాలు ఉంటాయన్నారు. బస్టాండ్‌లు, రవాణా కేంద్రాల వద్ద కూడా చుక్కలు వేసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా నిర్లక్ష్యం చేయకుండా మీ బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ సువర్ణజ్యోతి, హెచ్‌వీ వీ వీరమ్మ, సూపర్‌వైజర్‌లు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్స్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కారకర్తలు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బల్లికురవలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పోలియో మహమ్మారిని తరిమికొడదాం..

బల్లికురవ: పోలియో మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ కోరారు. జాతీయ పల్స్‌పోలియో దినోత్సవ సందర్భంగా శనివారం బల్లికురవలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల జీవితాలను కాపాడేందుకు ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించి వారి ప్రాణాలు నిలబెట్టాలన్నారు. మండలంలో 44 పోలియో బూత్‌ల ద్వారా 5,900 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయడమే లక్ష్యమని చెప్పారు. నూరు శాతం లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషిచేయాలన్నిరు. వైద్య ,ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు (చినగంజాం): పోలియో చుక్కలను చిన్నారుల అందరికీ వేయించి పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు చర్యలు తీసుకుందామని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి టీ అంజలి అన్నారు. మార్చి 3,4,5 తేదీల్లో పల్స్‌పోలియో కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న దృష్ట్యా ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆరోగ్య సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఇంకొల్లు స్థూపం సెంటర్ నందు మానవహారంగా ఏర్పడి పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాల్సినదిగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టీ అంజలి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా చుక్కలు ఆదివారం నాడే వేయించాలని తెలియజేశారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మొత్తం 3537 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భాను ప్రకాశరావు, సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, పీహెచ్‌ఎస్ సహస్ర, సూపర్‌వైజర్ మౌళి, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పూసపాడు, నాగండ్ల, ఇడుపులపాడు, వంకాయలపాడు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత

యద్దనపూడి: మండలంలోని గన్నవరం గ్రామ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని టీడీపీ మద్దతుదారులు శనివారం వేకువజామున చించివేశారు. ఈఘటనతో గ్రామంలో కలకలం రేగింది. ఎవరో పనికట్టుకొని చించివేయటం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యను జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ తీవ్రంగా ఖండించారు. ఒక ఫ్లెక్సీని చించివేస్తే దాని స్థానంలో పది ఫ్లెక్సీలు వెలుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు భయపడి వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో చిచ్చుపెట్టడం తగదన్నారు. ఈమేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



టీడీపీ నాయకులు చించివేసిన ఫ్లెక్సీ

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల టౌన్: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశమై అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఏవైనా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కరణం వారితో మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను చేరవేయాలని ఆయన సూచించారు. విధుల్లో మాత్రం అలసత్వంగా ఉండొద్దని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించారు. రామకృష్ణాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జాంద్రపేట పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన రోడ్డు ఆయన పరిశీలించారు. అలాగే ఎస్సీ కాలనీలో నివాసముంటున్న ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయితీ రాజ్ డీఈ శేషయ్య. పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, దివి జయరావు, పృథ్వీ ధనుంజయ, గ్రామ నాయకులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



జాంద్రపేట రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

వైఎస్సార్ సీపీ అడ్డాగా నియోజకవర్గం

● టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

అద్దంకి: నియోజకవర్గం మొత్తం వైఎస్సార్ సీపీ అడ్డగా మారుతోందని నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. సంతమాగులూరు మండలంలోని టీడీపీ పట్టున్న గ్రామాల్లోనూ టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. తాజాగా శనివారం మండలంలోని గురిజేపల్లి గ్రామం నుంచి ఓరుగంటి కోటిరెడ్డి ఆధ్వర్యంలో 10 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ సమన్వయకర్త పానెం చిన హనివిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో సంతమాగులూరు మండలం నుంచి ఈ సారి వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీ దిశగా అడుగులు వేస్తోందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొందరు నాయకులు వైఎస్సార్ సీపీని వీడినా, అటు టీడీపీ నుంచి వలసలు పెరుగుతున్నాయి. గట్టి పట్టున్న నాయకులు పార్టీలోనే కొనసాగుతుండడంతో గ్రామస్థాయిలో పార్టీకి బలమైన ఓటింగ్ ఉందని చెప్పక తప్పదు. మాకే బలం ఉందని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న వారికి ఇది చెంపపెట్టుగా మారనుంది.



మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

ప్రతి ఒక్కరూ దేవుని కృపను పొందాలి.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రతి ఒక్కరూ దేవుడి కృపను కలిగి ఉండాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి గ్రామంలో సీయోన్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సువార్త మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ సువార్త సభలతో దయ, ప్రేమ, కరుణ పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో దైవ సేవకులు పి.అబ్రహాం, వాక్యోపదేశకులు పాస్టర్ అబ్రహాం, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

సమన్వయంతో తిరునాళ్లు నిర్వహించుకోవాలి

చినగంజాం: ప్రజలు, పోలీసులు సమన్వయంతో శివరాత్రి తిరునాళ్లను నిర్వహించుకోవాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ సూచించారు. శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దేవాలయాల శాంతి కమిటీ సమావేశం ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలోని చినగంజాం పంచాయతీ, కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని లలితా రామ కోటేశ్వరాలయం, బాలకోటేశ్వరాలయం పరిధిలో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న శివరాత్రి తిరునాళ్లకు సంబంధించి రెండు దేవాలయాల నిర్వాహకులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆలయాలలో ఉదయం అభిషేకాలు సమయంలో భక్తులు రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో పోలీసు బందోబస్తు అవసరమన్నారు. సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వాహకులు పోలీసులను కోరారు. సాయంత్రం తిరునాళ్ల జరిగే సమయంలో ట్రాఫిక్‌ను జాతీయ రహదారి వద్ద ఆపివేయడంతో భక్తులు కొందరు ఆలయాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను పంపితే భక్తులు ఎక్కువ మంది పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని ఆలయ నిర్వాహకులు డీఎస్పీ దృష్టికి తీసుకొని వచ్చారు. భక్తులు జాగరణ ఉండేందుకు వీలుగా సాంస్కృతిక కార్యక్రమాలను వేకువ జామున 3 గంటల వరకు జరిగే విధంగా అనుమతి ఇవ్వాలని రెండు దేవాలయాల కమిటీ సభ్యులు డీఎస్పీని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి అందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరునాళ్ల శాంతియుతంగా జరిగే విధంగా ప్రజలు పోలీసులు సమన్వయంతో నిర్వహించుకుందామని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం శ్రీనివాసరావు, నల్లమోపు రామిరెడ్డి, జీ ఉమాశంకరరెడ్డి, టీఎస్సార్ ఆంజనేయులు, టీ శీతయ్య, జీ వెంకటస్వామి, ఆమంచి వెంకట సుబ్బారావు, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బేతపూడి ప్రసాద్

సమస్యలు పరిష్కరించాలని వినతి



సమన్వయకర్త బాలాజీకి సమస్యను తెలియజేస్తున్న ముస్లిం కుటుంబాలు

చినగంజాం: పేద కుటుంబాలకు చెందిన తమను గృహాలు నిర్మాణం చేసుకోనీయకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని సమస్యను పరిష్కరించాలని చినగంజాం మసీదు పేటకు చెందిన పలు కుటుంబాల వారు నియోజక వర్గ సమన్వయకర్త యడం బాలాజీకి విన్నవించుకున్నారు, శుక్రవారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో సమన్వయర్త నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. రెండేళ్లుగా తాము మసీదుపేటలో ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మించుకుంటున్నామని, పలు గృహాలు నిర్మాణం కూడా పూర్తి కావస్తుందని అయితే చినగంజాం పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు కొందరు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకునే విషయంలో, ఇళ్లనిర్మాణ విషయంలోను ఆటంకాలు కలుగజేస్తూ గత కొంతకాలంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించి మా గృహాల నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సుభాని, ఇసూబ్, షాకీర్, ముస్లిం కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

ఒంగోలు వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్

పర్చూరు (చినగంజాం): ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న మహిళకు పింఛను అందించి వలంటీర్ తన సేవాభావాన్ని చాటుకున్నాడు. వివరల్లోకి వెళ్తే మండలంలోని కొల్లావారిపాలేనికి చెందిన దారా బుచ్చమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఒంగోలు రిమ్స్‌లో చికిత్స చేయించుకుంటుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రేమల ప్రశాంతరాజు శనివారం ఒంగోలు వెళ్లి బుచ్చమ్మకు పెన్షన్ అందించాడు. ఆ సాయంతో బుచ్చమ్మ ఆనందంతో కన్నీళ్ల పర్యంతమై వలంటీర్ సేవలను మెచ్చుకుంది.



బుచ్చమ్మకు పింఛను అందిస్తున్న ప్రశాంత్‌రాజు